క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి

ఏన్కూరు: అంగన్‌వాడీల్లో గర్భిణులకు, చిన్నారులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్.దయామని అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రిజిస్టర్ నిర్వహణ సరిగా లేకపోయిన, పోషణ ట్రాకర్, ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లో దరఖాస్తు సరిగా లేకపోయిన తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార పదార్థాల కొరత ఉన్నట్లయితే వివారాలు తెలపాలన్నారు. చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ వెంకటమ్మ, రేఖాభాయి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థులు నేహాల్‌పాషా, విక్రమ్, హర్షవర్ధన్

ముదిగొండ: మండలంలోని మేడేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నేహాల్‌పాషా, పల్లె హర్షవర్ధన్, ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బొడ్డు విక్రమ్‌లు నల్లగొండలో జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలకు ఎంపికైనట్లు మేడేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పీఈటీ బయ్యని కృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వాసిరెడ్డి శ్రీనివాస్, మేడేపల్లి పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మేరాజ్ మసీద్ నూతన కమిటీ ఎన్నిక


అధ్యక్షుడు మీర్జా సలీం

సత్తుపల్లి: పట్టణంలోని వెంగళరావునగర్ మేరాజ్ మసీద్ కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ముస్లింల సమక్షంలో ఎన్నుకున్నారు. మేరాజ్ కమిటీ అధ్యక్షుడిగా మీర్జా సలీం, ఉపాధ్యక్షుడిగా ఇస్మాయిల్, ఎజాజ్, బబ్లు, సలీంబోలు, ఛాంద్ పాషా, ప్రధాన కార్యదర్శిగా మస్తాన్ అలీ, జాయింట్ సెక్రటరీగా రాజా, కోశాధికారిగా మహ్మద్ ముబారక్, జాయింట్ కోశాధికారిగా బషీర్‌లను ఎన్నుకున్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ మండల కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన పాస్టర్స్ ఫెలోషిప్ మండల కమిటీ సభ్యులు

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో పాస్టర్స్ ఫెలోషిప్ మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా రాజు, ప్రధాన కార్యదర్శిగా మహిమకుమార్, సహాయ కార్యదర్శిగా యోహాను, కోశాధికారిగా రాజేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. మండలంలో ఉన్న పేద పాస్టర్ల సంక్షేమానికి కృషి చేస్తూ సంఘం బలోపేతానికి పాటుపడతానని తెలిపారు.

'అభినవ మొల్ల'కు రచయితల నివాళి

సత్తుపల్లిటౌన్: ప్రాచీన, ఆధునిక, సాహిత్య ప్రక్రియల్లో అమూల్యమైన పుస్తకాలు రాసి అభినవ మొల్ల బిరుదు పొందిన చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ మృతిపట్ల సత్తుపల్లి సృజన సహితీ సమాఖ్య శుక్రవారం సంతాపం తెలిపింది. విద్యార్థి దశలోనే గాంధీ మృతిపై కవిత రాసిన ఆమె కాలక్రమంలో 22కు పైగా పుస్తకాలు రాసి తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. సమావేశంలో సృజన బాధ్యులు జి.రామకృష్ణ, బి.మధుసూదన్‌రాజు, గట్టే వాసు, పసుపులేటి నాగేశ్వరరావు ఉన్నారు.

కోట కనకరత్నానికి నివాళి..

ఇటీవల మృతి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుని కోట కనకరత్నం సంతాప సమావేశం శుక్రవారం సత్తుపల్లిలో జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయునిగా, మానవతావాదిగా ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం బాధ్యులు కేశవరెడ్డి, ప్రకాశరావు, వెంకటరత్నం, కృష్ణయ్య, బి.బాబు, సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

మధిర మోముపై చెరగని ముద్ర

- నాలుగు పర్యాయాలు విజయదుందుభి
- భట్టికి డిప్యూటీ సీఎం పదవి రాకతో ప్రజల్లో ఆనందోత్సాహాలు
- వెల్లువెత్తుతున్న అభినందనలు


ఆనాటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని కలిసి సమస్యలు విన్నవిస్తున్న భట్టి విక్రమార్క, వనం నరసింగరావు(ఫైల్)

ముదిగొండ: మధిర మోముపై చెరగని ముద్ర వేసుకుని వరసగా నాలుగు పర్యాయాలు విజయ దుందుభి మోగించారు. మధిర నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానం నుంచి పలు కీలక పదవులతో ప్రజలకు అతి దగ్గరగా చేరువయ్యారు. నాలుగోసారి అత్యధిక మెజారిటీతో గెలుపొంది, డిప్యూటీ సీఎం పదవిని దక్కించుకున్న వ్యక్తి, మధిర ఆణిముత్యం మన మల్లు భట్టి విక్రమార్క.

నిత్యం ప్రజల్లోనే..

నిత్యం ప్రజల కోసం పాటుపడి, స్వయంగా సమస్యలు వింటూ పరిష్కార దిశగా పయనించే ధీరత్వం కలిగిన వ్యక్తి. మధిర నియోజకవర్గంలో మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాల్లో అభివృద్ధికి బాటలు వేసిన భట్టి విక్రమార్క.. ప్రతి మండలానికి రూ.కోట్ల నిధులతో పనులు చేయించారు. జాలిముడి ఎత్తిపోతల పథకం, మున్నేరుపై రాకపోకలకు బ్రిడ్జీ నిర్మాణం, చెక్‌డ్యామ్‌లు, ఆనకట్ట నిర్మాణాలు, ప్రతి భారీ నిర్మాణాలు చోటుచేసుకున్నాయి. గత పదేళ్ల కాలంలో కొంత అభివృద్ధి కుంటుపడినా, ఈ నూతన కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ అభివృద్ధికి చిరునామాగా చెరగని ముద్ర వేసుకునేందుకు మధిరను ముందుంచే దిశలో డిప్యూటీ సీఎం అడుగులు వేయనున్నారు.

వెల్లువెత్తుతున్న అభినందనలు..

ప్రజల ఆశ, ఆంకాంక్షలు చూరగొన్న భట్టి విక్రమార్కకు ప్రజల నుంచి అపూర్వ అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతీ మండలానికి నిధులు వెచ్చించి అభివృద్ధికి బాటలు వేయనున్నారు. డిప్యూటీ సీఎం పదవి రాకతో ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గత 40సంవత్సరాల నుంచే కాంగ్రెస్ పార్టీలో కీలక పదువులు పొంది, ప్రజలకు సేవచేసేదానిలో ముందున్నారు. అంచెలంచలుగా పలు కీలక పదువులు సాధించి, ప్రజల సమస్యలను గురించి ఆనాటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దగ్గర ఉంచేవారు. మధిర నియోజకవర్గ ప్రజల కోసం పాటుపడేవారు.

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, రాజకీయ నాయకుల పదవులు, సమస్యలు, పలు అంశాలు స్వయంగా ఆనాడే వినిపించేవారు. డిప్యూటీ సీఎం రాష్ట్రానికే కాక, మధిర నియోజకవర్గానికి ప్రత్యేక స్థానానికి విలువనిచ్చే ప్రాధాన్యత సంతరించుకుంటుందని మధిర నియోజకవర్గ ప్రజలు ఆనందోత్సాహాలతో మునిగి తేలుతున్నారు.

పట్టుదలతో పనిచేస్తారు..



రాజకీయంగానైనా, ప్రజల సమస్యలపైన, అభివృద్ధి పనుల్లో ఏపనిచేసినా చాలా పట్టుదలతో పనిచేస్తారు. ప్రజల ప్రతీ సమస్యను విని పరిష్కారం చూపేవారు. ఆరోగ్యం సైతం లెక్కచేయక నిద్రలేని రాత్రులు గడిపేవారు. ఇదంతా స్వయం కృపారాధంతో పాటు ప్రజల మన్ననలు బలపడి ఉన్నాయి. డిప్యూటీ సీఎం పదవితో మధిర నియోజకవర్గ ప్రజలకు, అభివృద్ధికి బాటలు వేసేదాంట్లో ఇక ముందుంటారు.

– మల్లు నందిని, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి

ఏ పదవినైనా ధైర్యంగా నిర్వర్తిస్తారు..



ఏ పదవినైనా ధైర్యంగా నిర్వర్తిస్తారు. సమస్యలు పరిష్కరించేదానిలో ముందుంటారు. ప్రతీ అంశాన్ని కీలకంగా చర్చించి, ఆచి.. తూచి ముందుకు అడుగులు వేస్తారు. ప్రజల అభివృద్ధికి బాటలు వేస్తారు. పాదయాత్రలతో ప్రజలకు దగ్గరయ్యారు. ఆనాటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని పలు అంశాలపై కలిసి వెళ్లి పనులు చేయించారు. ఇప్పుడు అదే బాటలో డిప్యూటీ సీఎంగా ప్రజలకు చేరువయ్యారు.

– వనం నరసింగరావు, కమలాపురం

రాజకీయాల్లో గెలుపోటములు సహజం


కల్లూరురూరల్: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

తల్లాడ/కల్లూరురూరల్: రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, గెలిచినా.. ఓడినా నేనెప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటాననీ సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. తల్లాడలో శుక్రవారం ఆయన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలైన తర్వాత ఆయన తల్లాడ వచ్చి కార్యకర్తలు అధైర్యపడొద్దనీ, నిత్యం మీకు అందుబాటులో సీఎం సహాయ నిధి కింద నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ వల్ల 2,500 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని రాజకీయాకతీతంగా అందరికీ ఇవ్వాలని కోరారు. అదే విధంగా కల్లూరులో బీఆర్‌ఎస్ నాయకులతో సమావేశమై మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మూడుసార్లు నన్ను గెలిపించారని, అన్ని రంగాల్లో నియోజకవర్గం అభివృద్ధి చెందినా.. వ్యతిరేక పవనాలు వీచాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ డి.భద్రరాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్ రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు వెంకట్‌లాల్, దాసురావు, శ్రీనివాసరెడ్డి, వీరభద్రరావు, శ్రీనివాసరావు, ప్రదీప్‌రెడ్డి, సీతారామిరెడ్డి, వీరకృష్ణ, వెంకటి, జీవీఆర్, ఈ సమావేశంలో జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, డాక్టర్ లక్కినేని రఘు, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరావు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ త్వరగా కోలుకోవాలి..

సత్తుపల్లి: తొంటి గాయంతో శుక్రవారం యశోద ఆస్పత్రిలో చేరిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి వేంకటేశ్వరస్వామి, వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి దయ వల్ల ఆయన త్వరగా కోలుకోవాలని అన్నారు.

అధైర్యపడొద్దు..


మాట్లాడుతున్న కొండబాల కోటేశ్వరరావు

మధిర: బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ఎవరూ అధైర్యపడొద్దని అందరికీ అండగా నిలబడతామని జెడ్పీ చైర్మన్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గస్థాయి పార్టీ ముఖ్య నేతల సమావేశంలో కొండబాల కోటేశ్వరరావుతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఐదు మండలాల నుంచి ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు


సత్తుపల్లిటౌన్: వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ వై.శ్రీనివాసరావు

సత్తుపల్లిటౌన్/ఏన్కూరు: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి, రుద్రాక్షపల్లి, గంగారం, రంగాపురం, కొమ్ముగూడెం గ్రామాలలో దెబ్బతిన్న పంటలను వ్యవసాధికారి వై.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. అదే విధంగా ఏన్కూరు మండలంలోని రాయమాదారం, ఏన్కూరు, నాచారం, తూతకలింగన్నపేట గ్రామాల్లో వరిపంటలను వైరా ఏడీఏ బాబురావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు తగు సలహాలు, సూచనలు చేశారు. పంట వివారలు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలల్లో ఏఈఓలు స్వాతి, ఆశాజ్యోతి, మండల వ్యవసాయాధికారి నర్సింహారావు, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


వైరా: లాలాపురంలో వరిపొలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

వైరా/తల్లాడ: ఖమ్మం జిల్లాలో ఇటీవల వచ్చిన మిచాంగ్ తుపాన్ వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురంలో తుఫాన్ వల్ల దెబ్బతిన్న మిర్చి వరి పంటలను ఆయన బీజేపీ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నెల్లూరి కోటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. అదే విధంగా తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటను సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకుడు ఎస్.కె.లాల్‌మియా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏలే భద్రయ్య, రామారావు, అర్జునరావు, పుల్లయ్య, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు అనీల్ కుమార్, వీరయ్య, లక్ష్మన్, రాణి, రాధా, నరేష్, శ్రీను, అనసూయ, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి



పరీక్ష సామగ్రితో విద్యార్థులు

మధిర: ఈ నెల 10న ఖమ్మంలో జరగబోయే జాతీయస్థాయి ప్రతిభా పరీక్ష ఎన్‌ఎంఎంఎస్‌కు సిద్ధమవుతున్న మాటూరు హైస్కూల్ విద్యార్థులకు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు గుంటుపల్లి రమాదేవి పరీక్ష సామగ్రి వితరణగా అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెరుపల్లి శ్రీహరి మాట్లాడుతూ.. ఎన్‌ఎంఎంఎస్ ప్రతిభ పోటీ పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాలు ఉపకార వేతనంగా అందుతాయని తెలిపారు. అదనపు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించిన పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. గత 5 సంవత్సరాలుగా ఉచితంగా పరీక్ష సామగ్రి అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పీఈటీ రమాదేవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దీవి సాయి కృష్ణమాచార్యులు, సంక్రాంతి శ్రీనివాసరావు, కొలగాని ప్రసాదరావు, మేడేపల్లి శ్రీనివాసరావు, చౌడవరపు సునీత, రెంటపల్లి భాగ్య శ్రీనివాసరావు, వేము రాములు, గుంటుపల్లి రమాదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే


ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రాగమయి, దయానంద్

సత్తుపల్లి: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మల్లుభట్టి విక్రమార్క, మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను శుక్రవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ దయానంద్‌లు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. వీరివెంట ఎండీ కమల్‌పాషా, ఎండీ యూనిష్, కొత్తూరు ప్రభాకర్‌రావు, తోట గణేష్, దూదిపాల రాంబాబు, ఎస్‌కె రఫీలు ఉన్నారు.

కుట్టుమిషన్ వితరణ

వైరా: గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ వైరా వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిరుపేద మహిళకు కుట్టుమిషన్ వితరణగా అందజేశారు. శుక్రవారం లయన్ జాలా పుల్లారావు, మహాలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వైరాకు చెందిన మోరే పద్మలకు కుట్టుమిషన్ అందజేశారు. లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు ఉండ్రు వరలక్ష్మి, జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, ఆర్‌సీ లగడపాటి ప్రభాకర్, జెడ్‌సీ డాక్టర్ శ్రీధర్ గౌడ్, శ్రీకాంత్, కిషన్ పాల్గొన్నారు.

గర్భిణులకు వరం న్యూట్రిషన్ కిట్

తల్లాడ: న్యూట్రిషన్ కిట్లు అందించడం గర్భిణులకు వరమని మండల వైద్యాధికారి రత్న మనోహర్ అన్నారు. తల్లాడ పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి.. న్యూట్రిషన్ కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, మేరమ్మ, వసంతకుమారి, భద్రమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు కుర్నవల్లి సెక్షన్ విద్యుత్ శాఖాధికారి సుందర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మిట్టపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా మిట్టపల్లి, నూతనకల్, లక్ష్మీపురం, వెంగన్నపేట, రంగంబంజర, నారయ్యబంజర, మల్సూర్‌తండా, రామానుజవరం, పినపాక, వెంకటాపురం గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని.. విద్యుత్ వినియోగదారులు సహకరించాలనీ కోరారు.

కల్లూరురూరల్: మండలంలోని పెద్దకోరుకొండి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సత్యం తెలిపారు.

కారేపల్లిలో మాలాధారుల నగర సంకీర్తన

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీషిరిడీ సాయిబాబా మందిర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి మహాపీఠం వద్ద అయ్యప్ప స్వామి మాలాధారులు గణపతి హోమం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూజారులు నాగసాయిశర్మ ఆధ్వర్యంలో గురుస్వాములు పాలిక సారయ్య, గుగులోత్ రాందాస్, తేజావత్ శంకర్, కేతిమళ్ల శ్రీను, సంగు సాయి, పాలిక శ్రీనివాస్ గురుస్వాముల పర్యవేక్షణలో అయ్యప్పస్వామి మాలాధారులు హోమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం కారేపల్లిలో నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాలాధారులు వేంకటేశ్వర్లు, రమేష్, శ్రీనివాస్, వెంకట్, నాగరాజు, సాయి, కట్టా రమేష్, వాసు, సుధాకర్ పాల్గొన్నారు.

భద్రాచలానికి పాదయాత్ర

కొణిజర్ల: తన అభిమాన నేత ఎనుముల రేవంత్‌రెడ్డి సీఎం కావాలని, వైరాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాలోత్ రాందాస్ నాయక్ విజయం సాధిస్తే కాలినడకన భద్రాచలం వచ్చి మొక్కులు చెల్లిస్తానని మొక్కుకున్న కొణిజర్ల మండలం అన్నవరం గ్రామానికి చెందిన రాయల యల్లారావు శుక్రవారం భద్రాచలానికి కాలినడకన బయలు దేరాడు.

రాయుడుపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయానికి..

వేంసూరు: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మట్టా రగమయి నిలిచి.. గెలవడంతో మండలంలోని సత్యనారాయణపురం కాంగ్రెస్ నాయకుడు పుచ్చాకాయల కాంతారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాయుడుపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు కాలినడకన వచ్చి మొక్కులు చెల్లించారు.

శబరిమలైకు సైకిల్‌పై..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లికి చెందిన అయ్యప్ప మాలాధారణ భక్తులు బేతిని శేషగిరిరావు, కన్నెగంటి లోకేష్‌లు శుక్రవారం స్థానిక శ్రీహరిహరాత్మజ అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి శబరిమలైకు సైకిల్ యాత్ర చేపట్టారు. సుమారు 14వందల కిలోమీటర్లు వెళ్తున్న ఇద్దరు స్వాములను ఆలయ కమిటీ నిర్వాహకులు మల్లికార్జునశర్మ, అమరలింగేశ్వరరావులు సత్కరించారు.

వెంకటపురంలో వైద్య శిబిరం

వేంసూరు: మండలంలోని వెంకటపురం, వేంసూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని తహసీల్దార్ ఎంఏ రాజు, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ రంజిత్ కుమార్ పరిశీలించారు. మిచాంగ్ తుపాన్ కారణం గ్రామాల్లో వ్యాధుల వ్యాప్తి తగ్గించేందుకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

మదర్ థెరిస్సా సేవాసదన్‌లో అన్నదానం

మధిర: పట్టణానికి చెందిన లగడపాటి రామ్మోహన్‌రావు, స్వప్నల నూతన గృహ ప్రవేశం సందర్భంగా శుక్రవారం మదర్ థెరిస్సా సేవాసదన్ మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.